VC NEWS

# వేగుచుక్క


పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 29 బుధవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 193



వచ్చే ఏడాదీ కరెంటు ఛార్జీల పెంపు ఉండదు


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ





' రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డి లో ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా

- జిల్లాలో వరి ఉత్పత్తిని పెంచేలా చేసిన కెసిఆర్
- రైతుబంధు ఉంటే కెసిఆర్‌ను గుర్తుంచుకుంటారన్న కుళ్లు
- రైతుభరోసా పేరుతో కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోంది
- ఇచ్చిన హామీలపై ప్రజలు కాంగ్రెస్‌ను నిలదీయాలి
- నల్లగొండలో ఇదో విజయోత్సవ సభలా ఉంది
- నల్లగొండ రైతు ధర్నాలో కెటిఆర్ విమర్శలు

"రైతులు నాట్లేసే సమయంలో కేసీఆర్ రైతుబంధు ఇచ్చేవారు. ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి ఓట్లేసే సమయంలో ఇస్తారు. ఇప్పటికే సీఎం ప్రతి రైతుకు ఎకరాకు రూ.17,500 బకాయిపడ్డారు. ఈ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేశాకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లడగాలి"



# ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

- టెంపుల్ టూరిజం పట్ల నిర్లక్ష్యం వహించారు
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేలే ప్రోత్సహిస్తాం
- కో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఇది సినిమా షూటింగ్‌లకు అద్భుతమని చెప్పిన నటుడు చిరంజీవి

'ఇది షూటింగ్స్‌కు ఇస్తారా రాందేవ్' అని అడిగితే, 'ఫస్ట్ మీ మూవీ షూట్ అయితే ఇస్తా'

**రంగారెడ్డి:** ప్రకృతి రమణీయతకు మారుపేరుగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఉన్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏటా కోటి మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ఉన్నామని అన్నారు. తెలంగాణను ప్రకృతివనంగా మార్చాల్సి ఉంది. తల్లి పేరిట విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించే విధానం తీసుకొస్తాం. త్వరలో విధివిధానాలు ఖరారుచేస్తాంఅని సీఎం అన్నారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో 150 ఎకరాల్లో ఈ పార్కును తీర్చిదిద్దారు. దీనిలో 25వేల జాతుల మొక్కలు ఉన్నాయి. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన వృక్షాలు, చెట్లు ఉన్నాయి. ఎక్స్ పీరియం పార్కులో రూ.లక్ష నుంచి రూ.3.5కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలు వృక్షాలను సినీ, రాజకీయ, వ్యాపార

మిగతా 2లో





## థియేటర్లకు హైకోర్టు షాక్

16 ఏళ్ల లోపు పిల్లలకు టైమింగ్స్

ఉదయం 11 తరవాత..రాత్రి 11 లోపు మాత్రమే అనుమతి





## ప్రారంభమైన నాగోబా జాతర...

ఫిబ్రవరి 4 వరకు వేడుకలు

600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాల ఏర్పాటు



# కుంభమేళాలో తొక్కిసలాట.. 15 మంది మృతి!

ప్రయాగ్‌రాజ్: మహా కుంభమేళాలో అపశ్రుతి చోటు చేసుకుంది. మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు సంగమం వద్దకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల తాకిడికి బారికేడ్లు విరగడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో సుమారు 15 మంది మృతిచెందినట్లు సమాచారం. ఈ మేరకు ఘటనాస్థలంలో ఓ వైద్యుడు చెప్పినట్లు జాతీయ మీడియా పేర్కొంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. మరోవైపు పలువురు భక్తులకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన సిబ్బంది వారిని అంబులెన్సుల్లో సమీప ఆస్పత్రులకు తరలించారు.

**యోగి ఆదిత్యనాథ్‌కు ప్రధాని మోదీ ఫోన్**

కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ ఆరా తీశారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మహా కుంభమేళాలో అపశ్రుతి చోటు చేసుకుంది. తొక్కిసలాట జరగడంతో పలువురు మృతిచెందారు. మరికొందరికి గాయాలయ్యాయి.

# భట్టి చెప్పింది నిజమా? మీరు చెప్పింది నిజమా?



హైదరాబాద్: దావోస్‌లో జరిగిన ఎంవోయూలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పింది నిజమా? మీరు చెప్పింది నిజమా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. 'దావోస్‌లో జరిగే ఎంవోయూలు అన్నీ కూడా ఆసక్తి వ్యక్తీకరణ మాత్రమే. ఎవరైనా ఓపెన్ టెండర్లలో రావాల్సిందేనని భట్టి విక్రమార్క అంటే.. మీరేమో 1.82లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు గప్పాలు చెబుతున్నారు. రైతు భరోసా కోసం గంపెడు ఆశతో, కొండంత ఆందోళనతో ఎదురుచూస్తున్న రైతుల ఆరాటాన్ని చిల్లర పంచాయతీ అంటరా? సంక్రాంతికి రైతుభరోసా ఇస్తానన్న సంగతి తేలిపోయింది. జనవరి 26న చేదు మాత్రనే అయ్యింది. ఇప్పుడు మార్చి 31 వరకు గడువు పెంచారు. జర్నలిస్టులు ఇదేమిటీ అని అడిగితే చిల్లర పంచాయితీ అంటున్నారు. రైతుల అప్పులు ముఖ్యమా? దావోస్ డప్పులు ముఖ్యమా?' అంటూ హరీశ్‌రావు సీఎంను ప్రశ్నించారు. 'పెట్టుబడుల కట్టుకథను నమ్మించేందుకు శతవిధాలా ప్రయత్నించి అట్టర్‌ఫ్లాప్ అయినట్లుగా ఉంది రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్. ఎప్పుడో అయిపోయిన దావోస్‌కు ఇప్పుడు ఎందుకు దావతు' అంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పేర్కొన్నారు.

దావోస్‌లో జరిగిన ఎంవోయూలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పింది నిజమా? మీరు చెప్పింది నిజమా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

వేగుచుక్క

# ఎకో టూరిజం అభివృద్ధికి కృషి

ప్రముఖులు కొనుగోలు చేశారు. రాందేవ్‌రావ్ ఆరున్నరేళ్ల పాటు శ్రమించి ఎక్స్ పీరియంను తీర్చిదిద్దారు. దీనిలో వివిధ ఆకృతుల్లో రాక్ గార్డెన్‌ను సిద్ధం చేశారు. 1500 మంది కూర్చునేలా యాంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.150 కోట్ల విలువైన మొక్కలు, చెట్లు, వృక్షాలు కలిగిన ఏకైక పర్యాటక ప్రాంతంగా ఇది నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. 'అటవీ ప్రాంతాల సందర్శనకు మధ్యప్రదేశ్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మందిరాల దర్శనాల కోసం తమిళనాడు, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాం. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదన్నారు. ఎకో టూరిజంపై ఇటీవలే అసెంబ్లీలో చర్చించాం. పర్యాటక పాలసీ తీసుకువచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం అన్నారు. ఎకో టూరిజం కింద త్వరలో వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో మరిన్ని పర్యాటక క్షేత్రాలు రావాల్సి ఉంది. వరితో పాటు వాణిజ్య పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.. అనంతరం నటుడు చిరంజీవి మాట్లాడుతూ రాందేవ్‌ను కొనియాడారు. 'పొద్దుటూరు ప్రదేశం నాకు ముందే తెలుసు. నేను ఇల్లు కట్టుకున్నప్పుడే రాందేవ్ నాకు కొన్ని విదేశీ మొక్కలు ఇచ్చారు. మా ఇంటి వద్ద పెరిగిన మొక్కలను



చూస్తే చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. మన హైదరాబాద్‌లోనే ఇలాంటి మొక్కలను రాందేవ్ తీసుకురావడం అభినందనీయం. ఆయన వ్యాపారవేత్తగా కాకుండా కళాకారుడిగా కనిపించారు' అని చిరంజీవి అన్నారు. ఎక్స్‌పీరియం పార్కు హైదరాబాద్‌కు తలమానికం అవుతుందని, ఒక కళాఖండంగా మిగిలిపోతుందని చిరంజీవి అన్నారు. విదేశాలకు వెళ్లినప్పుడు ఇలాంటి మొక్కలు, కళాకృతులు చూస్తుంటాం. ఇండియాకు తీసుకెళ్తే బాగుండని అనిపించేది. ఇక్కడ హైదరాబాద్ శివారులో అవి లభిస్తున్నాయంటే, చాలా ఆనందంగా ఉంది. మా ఇంటి దగ్గర నేను రోజూ కూర్చొనే ప్రదేశంలో బయటకు కనపడకుండా ఫెన్సింగ్‌లా డిజైన్ చేయమంటే, రాందేవ్ అద్భుతంగా చేసి ఇచ్చారు. నా ఇంటి చుట్టూ చాలా చక్కని చెట్లు పెట్టుకున్నా. రాందేవ్ 'కొత్తగా మొక్కలు వచ్చాయి చూస్తారా' అని అడుగుతూ ఉంటారు. ఒకప్పుడు వాటి ధరలు వేలు, లక్షల్లో ఉండేవి. ఇప్పుడు కోట్లలో ఉంటున్నాయి. అసలే నా సంపాదన అంతంత మాత్రంగా ఉంది. కొనలేనేమో అనిపించింది. గౌరవ ముఖ్యమంత్రితో ఇక్కడకు వచ్చి, చూస్తే ఇవన్నీ కొనేయాలనిపిస్తోంది' 'ఇలాంటి వాటిని పెట్టాలంటే వ్యాపార దృక్పథం ఉంటే సరిపోదు. అందుకే రాందేవ్‌లో ఒక ఆర్టిస్ట్‌ను చూస్తా. మొక్కలపై అంత ఇష్టం లేకపోతే దాదాపు పాతికేళ్లు ప్రయోగాలు చేస్తూ, విదేశాల్లో ఉన్న అరుదైన మొక్కలను సైతం ఇక్కడకు తీసుకొచ్చి, ఇది సాధ్యమే అని నిరూపించారు. ఎక్స్‌పీరియంలోని శిలాకృతులు మన హైదరాబాద్‌కు అందం తీసుకొస్తాయి. డబ్బులు, స్థలం ఉంటే ఎవరైనా రియల్ ఎస్టేట్ చేద్దామని అనుకుంటారు. ప్రభుత్వ అనుమతి తీసుకుని, పెద్ద మల్టీస్టోర్ బిల్డింగ్ కడితే, తరాలు నిలిచిపోతుంది. కానీ, రాందేవ్ తన మదిలో ఉన్న దాన్ని వాస్తవంలోకి తీసుకొచ్చారంటే నిజంగా హ్యాట్సాఫ్. 'ఇది షూటింగ్స్‌కు ఇస్తారా

రాందేవ్' అని అడిగితే, 'ఫస్ట్ మీ మూవీ షూట్ అయితే ఇస్తా' అన్నారు. ఇప్పుడు కొత్త హీరోయిన్‌ను తీసుకొచ్చి స్టెప్పులు వేయాలంటే ఈ ఎండలో ఎలా ఉంటుందో. వచ్చే శీతాకాలంలో చూద్దాం. ఈలోగా వర్షాలు పడి, మరింత పచ్చదనం పెరుగుతుంది. ఒకట్రెండు ఏళ్లలో కంటికి ఇంపుగా ఉంటుంది. ప్రభుత్వం కూడా రాందేవ్ ఆలోచనలకు సహకారం అందించి, టూరిజం అభివృద్ధికి కృషి చేస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. ఎక్స్‌పీరియం హైదరాబాద్‌కు అద్భుతమైన ల్యాండ్ మార్క్ అవుతుంది. హైదరాబాద్ ఇల్లు అనుకుంటే, ఇంట్లో చక్కని పెయింటింగ్ పెట్టుకుంటే ఎలా ఉంటుందో ఈ రోజు ఎక్స్‌పీరియం అలాంటిది' అని చిరంజీవి అన్నారు.

# వచ్చే ఏడాదీ కరెంటు ఛార్జీల పెంపు ఉండదు

హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26)లో కరెంటు ఛార్జీల పెంపు లేదని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు తెలిపాయి. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్) నివేదికను మంగళవారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి సమర్పించాయి. ఈఆర్సీ ఛైర్మన్ విదేశీ పర్యటనలో ఉన్నందున నివేదికను మీడియాకు వెల్లడించలేదు. ఆయన వచ్చిన తరవాత నివేదికను ప్రజల ముందు పెట్టి బహిరంగ విచారణ చేస్తామని ఈఆర్సీ వర్గాలు తెలిపాయి. ఏటా మార్చి ఆఖరులోగా నివేదికపై ప్రజల సమక్షంలో మండలి బహిరంగ విచారణ జరిపి తుది ఉత్తర్వులు ఇవ్వాలని విద్యుత్ చట్టం చెపుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వచ్చే ఏడాది ఆదాయం కన్నా వ్యయం రూ.20,151 కోట్లు అధికంగా ఉంటుందని డిస్కంలు తెలిపాయి. ఈ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం రాయితీ పద్దు కింద బడ్జెట్‌లో కేటాయిస్తే ఛార్జీలు పెంచాల్సిన అవసరం లేదని వివరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25)లో రాయితీ పద్దు కింద రూ.12 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించింది. వచ్చే ఏడాది ఏర్పడే లోటును భర్తీ చేయాలంటే మరో రూ.8 వేల కోట్లకు పైగా పెంచి మొత్తం రూ.20,151 కోట్లను బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంటుంది.ఆకాశాన్నంటుతున్న డిస్కంల నిర్వహణ వ్యయరెండేళ్లుగా కరెంటు ఛార్జీలను పెంచకపోవడంతో డిస్కంలకు ఆదాయం పెద్దగా పెరగలేదు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు భారీగా పెరుగుతున్నందున డిస్కంల నిర్వహణ వ్యయం ఆకాశాన్నంటుతోంది. "ప్రస్తుతం అమల్లో ఉన్న కరెంటు ఛార్జీల ప్రకారం వచ్చే ఏడాది రూ.45,698 కోట్ల ఆదాయం వస్తుంది. వ్యయం రూ.65,849 కోట్లకు చేరుతుంది. రూ.20,151 కోట్ల ఆర్థికలోటు ఏర్పడుతుంది" అని ఈఆర్సీకి డిస్కంలు వివరించాయి. గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా గల దక్షిణ డిస్కంకు వచ్చే ఆదాయం రూ.36,277 కోట్లు కాగా... వ్యయం రూ.46,035 కోట్లు ఉంటుందని అంచనా. వరంగల్ కేంద్రంగా గల ఉత్తర డిస్కంకు వచ్చే ఏడాది ఆదాయం రూ.9,421 కోట్లు రావొచ్చని, వ్యయం రూ.19,814 కోట్లు ఉంటుందని నివేదికలో తెలియజేశాయి. ఉత్తర తెలంగాణలో వ్యవసాయ బోర్లకు, కాళేశ్వరం, పలు ఎత్తిపోతల పథకాలకు కరెంటు వినియోగం అధికంగా ఉంటున్నందున ఆర్థికలోటు అధికంగా ఉంటుందని అంచనా.ఇళ్లకు ఉచితానికి రూ.2,400 కోట్లు.గృహజ్యోతి పథకం కింద పేదల ఇళ్లకు నెలకు 200 యూనిట్ల వరకు కరెంటును ఉచితంగా ఇవ్వడానికి వచ్చే ఏడాది దాదాపు రూ.2,400 కోట్లు అవసరమని అంచనా. అదనపు ఆదాయం రాబట్టడానికి ఛార్జీలను స్వల్పంగా పెంచితే బాగుంటుందని డిస్కంలు ప్రతిపాదించినా ప్రజలపై భారం వేయవద్దని ప్రభుత్వం తెలిపినట్లు సమాచారం. వచ్చే నెలలో శాసనసభలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో విద్యుత్ రంగానికి ఎన్ని నిధులు కేటాయించనుందనేది ప్రభుత్వం వెల్లడించనుంది. దాని ప్రకారం ఏఆర్ఆర్‌పై ఈఆర్సీ తుది నిర్ణయం తీసుకోనుంది.

# థియేటర్లకు హైకోర్టు షాక్

**హైదరాబాద్:** పుష్ప 2' సినిమా ప్రీమియర్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన అనంతరం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చిన విషయం తెలిసిందే.

హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుని ఇకపై బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంచుకోవడాలు వంటి వెసులుబాటు ఉండదని స్పష్టంగా ప్రకటించింది. సంక్రాంతికి వచ్చిన 'గేమ్ చేంజర్' సినిమాకు టికెట్ల ధరను పెంచుకునే వెసులుబాటు కల్పించినా.. కోర్టు కలగజేసుకోవడంతో.. వెంటనే టికెట్ల ధరలను తగ్గించారు. దీంతో చిన్న సినిమాలకు ఏమోగానీ.. భారీ బ్జడెట్‌తో రూపొందే సినిమాలకు మాత్రం అంతే భారీగా ఇబ్బంది నెలకొంది. ఇదిలా ఉంటే.. తాజాగా హైకోర్టు.. ఫ్యామిలీ ఆడియన్స్‌కు, థియేటర్ సినిమాలకు మరో భారీ షాక్ ఇచ్చింది. ఇకపై థియేటర్స్‌లో పిల్లలు సినిమా చూడాలంటే నిర్దిష్ట సమయంలో మాత్రమే చూడాలనేలా తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తరువాత 16 ఏళ్లలోపు పిల్లలను సినిమాలకు అనుమతించరాదని థియేటర్లకు హైకోర్టు తెలిపింది. 'గేమ్ ఛేంజర్' మూవీ టిక్కెట్ ధరల పెంపును, అదనపు షోలకు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన 4 పిటిషన్లపై విచారణ చేపట్టగా.. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ హైకోర్టు గత ఉత్తర్వుల మేరకు బెనిఫిట్ షోకు అనుమతిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పునః సమీక్షించి, ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతించరాదని నిర్ణయం తీసుకుంటూ జనవరి 11న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రజా ప్రయోజనాలు, ఆరోగ్యం, రక్షణలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకూడదనేలా నిర్ణయం తీసుకుందని తెలిపారు. అలాగే సినిమాటోగ్రఫీ నిబంధనల ప్రకారం ఉదయం 8.40లోపు, అర్ధరాత్రి 1.30 గంటల తర్వాత సినిమాలకు అనుమతించరాదని పేర్కొన్నారు. ముఖ్యంగా మైనర్లను అనుమతించరాదని, లేని పక్షంలో అది వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రస్తుతం మల్టీప్లెక్స్ థియేటర్లలో చివరి షో అర్ధరాత్రి 1.30 గంటల వరకు నడుస్తుందని, ఇందులో మైనర్ల ప్రవేశానికి ఎలాంటి నియంత్రణలు లేవని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా, 'పుష్ప 2' బెనిఫిట్ షో సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందగా, బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని.. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సూచించారు. ఇప్పుడు కోర్టు ఇచ్చిన ఆదేశాలతో సెకండ్ షోలకు 16 సంవత్సరాల లోపు వారి నిషేధాన్ని అమలు చేయటం వల్ల అది కచ్చితంగా వసూళ్లపై ప్రభావం చూపుతుంది. అసలే ఓటీటీలు వచ్చి.. ప్రేక్షకులను థియేటర్లకు రానివ్వకుండా చేస్తుంటే.. ఇప్పుడీ ఆదేశాలు మరింతగా థియేటర్లపై ప్రభావం చూపే అవకాశం అయితే లేకపోలేదు.

# ప్రారంభమైన నాగోబా జాతర...

**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్రపరిచారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు చేస్తారు. అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర,



ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.

నాగోబా జాతర సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక నాగోబా జాతర అని, గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు అంటూ పేర్కొన్నారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబురం తెలంగాణ సాంస్కృతిక వైభవమని పేర్కొన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ వేడుకలో ఆధ్యాత్మక వెలుగులు నింపే ఆదిశేషువు కరుణాకటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. వనమే ఆలంబనగా అత్యంత నియమ నిష్టలతో ఆదివాసీలందరూ జరుపుకునే వేడుక "నాగోబా జాతర" సందర్భంగా ముఖ్యమంత్రి గిరిజన సోదర, సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్య అమావాస్య నాడు ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబురం ప్రారంభంకానుంది. గోండుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన నాగోబా జాతరను ఆదివాసీ, గిరిజనులు ఘనంగా జరుపుకుంటారు. ఈ జాతరకు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలను పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దీంతో ప్రభుత్వం సుమారు 600 మంది పోలీసులు, 100 సీసీ కెమెరాలతో పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది.ప్రతి సంవత్సరం పుష్య అమావాస్య సందర్భంగా గిరిజనుల ఇలవేల్పు నాగోబా మహాపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం మెస్రం వంశీయులు నెల రోజుల ముందు నుండే ఏర్పాట్లు చేపడతారు. కాలినడకన సుమారు 250 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి తీసుకువచ్చిన పవిత్ర గోదావరి జలాలలో నాగోబాకు అభిషేకం, మహాపూజ చేయడంతో ఈ ఇక్కడ జాతర మహోత్సవం ప్రారంభమవుతుంది. ఇప్పటికే నాగోబా అభిషేకానికి కావాల్సిన పవిత్ర గంగా జలాలను తీసుకొని కేస్లాపూర్ కు వచ్చిన మెస్రం వంశీయులు ఆలయ సమీపంలోని మర్రి చెట్టు వద్ద విడిది చేసి ఉన్నారు. మంగళవారం రాత్రి అక్కడి నుండి గిరిజన సంప్రదాయ దుస్తుల్లో వాయిద్యాలతో ఆలయానికి చేరుకుంటారు. అనంతరం మెస్రం వంశీయులు, కట్టోడాలు ఆలయాన్ని శుద్ధి చేస్తారు. ప్రత్యేకంగా ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో తయారు చేయించిన కుండలను మాత్రమే గిరిజనులు ఇక్కడ పూజలకు వినియోగించడం ఆనవాయితీగా వస్తుంది.

# నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ

**నల్గొండ:** ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన.. వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. ఇక్కడికి గోదావరి జలాలను తరలించిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో భారాస రైతు మహా ధర్నాలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ..' రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ.73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు.

రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డి లో ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్ని పంటలకు క్వింటల్‌కు రూ.500 బోనస్ ఇస్తమన్నడు. మరె ఎవరికన్నా బోనస్ పైసలు పడ్డయా..? ఇప్పుడు మాట మార్చి సన్నవడ్లు పండిస్తెనే బోనస్ ఇస్తం అంటున్నరు. ఇగ వ్యవసాయ మంత్రి అయితే సన్నవడ్లకు బోనస్ ఇచ్చుడు బాగుంది, రైతు భరోసా అక్కెరే లేదని రైతులే చెప్తున్నరు



అంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నయ్ కాబట్టి రైతుభరోసా ఇస్తం అని నాటకమాడుతున్నరు. ఈ నాటకాలను మీరు గమనించాలె. ఎన్నికలు అయిపోంగనే రైతు భరోసా కూడా బందైతది' అని కేటీఆర్

హెచ్చరించారు. ఇప్పుడు ఆరోగ్య శ్రీ అంటే వైఎస్ఆర్ యాదికొస్తరు. రైతుబంధు అంటే కేసీఆర్ గుర్తుకొస్తరు. అందుకే రైతుబంధు ఇస్తే కేసీఆర్‌కే పేరు వస్తదని, ఆయనను ఎవరూ దేకరని రేవంత్‌రెడ్డి భయపడుతున్నడు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని మీరు ఇక్కడ గమనించాలె అని అన్నారు. రైతుభరోసా పేరుతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం.. ఇప్పుడు రైతులకు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ ఉన్నడు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లా ఓట్లు అడగడానికి వస్తరు. అప్పుడు ఈ బాకీ డబ్బులు అడుగుండ్రి. రుణమాఫీ ఏమైందని అడుగుండ్రి. ఏమైంది బోనస్ అని అడుగుండ్రి. ఆరుగ్యారంటీలు ఏమైనయని నిలదీయుండని కేటీఆర్ నల్లగొండ రైతులను కోరారు. రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పెద్దపెద్ద మాటలు చెప్పిండని, అధికారంలోకి వచ్చినంక ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు అట్టర్‌ఫ్లాప్ అయ్యిందన్నారు. అసెంబ్లీలో ఇదే విషయమై నిలదీస్తే రేవంత్ రెడ్డి నోరు మెదపలేదన్నారు. ఇప్పటికీ రుణమాఫీకి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.12 వేల కోట్లు కూడా దాటలేదన్నారు. 'ఇప్పుడు గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు. ఏమాయె రుణమాఫీ అంటే సమాధానం లేదు. ఏమాయె ఆరు గ్యారంటీలు అంటే సమాధానం లేదు. కేసీఆర్ బిచ్చమేసినట్టు రూ.10 వేలే ఇస్తున్నడూ.. నేను రూ.15 వేలు ఇస్తా అని రేవంత్ రెడ్డి చెప్పిండు. మరె ఇస్తున్నడా రూ.15 వేలు..? ఆఖరికి రూ.12 వేలు ఇయ్యాలని నిర్ణయం జేసిండ్రు. పైగా అది చారిత్రాత్మక నిర్ణయం అని అంటున్నడు. మోసం చేసుడు గూడా చారిత్రాత్మకమేనా అంటూ కెటిఆర్ ఎద్దేవా చేశారు. జనవరి 26 రాత్రి నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు పడుతాయని చెప్పాడని, కానీ ఇంతవరకు రైతు భరోసా డబ్బులు రాలేదని ఆయన ఆరోపించారు. నల్లగొండ బిడ్డలు జీవచ్ఛవాలుగా మారడానికి కారణమే కాంగ్రెస్. నల్లగొండ రైతుల అవస్థకు కారణమే కాంగ్రెస్. మిమ్మల్ని మోసం చేయడానికే కాంగ్రెస్ నేతలు కొత్త వేషాలు వేసుకుని ఎన్నికలకు వచ్చిండ్రు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిండ్రు' అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ లో విద్యార్థులు గొడ్డు కారంతో అన్నం తినాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఐటీ టవర్ కళ తప్పిందని విమర్శించారు. తన రాక సందర్భంగా నల్లగొండ ప్రజల ఆదరణ చూస్తుంటే.. తాను రైతు ధర్నాకు వచ్చినట్లు లేదని, విజయోత్సవ ర్యాలీకి వచ్చినట్లు ఉందని అన్నారు.

వెంకట్‌రెడ్డి వచ్చినంక

అండ్ల ఎవలన్న ఉన్నరో.. లేకుంటే తాగుబోతుల అడ్డా అయిందోగానీ, మొత్తానికైతే ఐటీ టవర్ కళ తప్పింది' అన్నారు. ఒక విజయోత్సవ ఊరేగింపు జరిగినట్లుగా ఉంది. భారీగా ధర్నాకు తరలివచ్చిన నల్లగొండ రైతు బిడ్డలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని కేటీఆర్ చెప్పారు.

# పవన్‌కల్యాణ్ ఉండగా లోకేశ్ ఏలా ఇస్తారు డిప్యూటీ సీఎం పదవి

**టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

**అమరావతి:**నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని టీడీపీ కార్యకర్తలు చేస్తున్న డిమాండ్‌పై టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పందించారు. లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేయడం సరికాదని అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో బుచ్చయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటికే పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు లోకేశ్‌కు డిప్యూటీ సీఎం ఎందుకు ఇవ్వడమని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ కోసం లోకేశ్ ఎంతగానో కష్టపడ్డారని.. అందుకు సముచిత స్థానం ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో పెట్టుబడిదారులు పారిపోయారని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కూటమిపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు

. విశాఖ, రాయలసీమ కేంద్రాలుగా పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రం సహకారంతో ఏపీ, తెలంగాణ ముందుకు వెళు తున్నాయని అన్నరు. ఉమ్మడి ఆస్తుల విషయంలో ఇంకా క్లారిటీ రావాల్సి ఉందని చెప్పారు. మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర విమర్శలు గుప్పించారు. విశాఖ కేంద్రంగా విజయసాయిరెడ్డి దోపిడీ చేశారని మండిపడ్డారు. వేల ఎకరాలు, లక్షల కోట్లు దోచుకున్న వ్యక్తి విజయసాయి రెడ్డి అని అన్నారు. ఏ2గా ఉన్న విజయసాయి కేసుల నుంచి తప్పించుకోవడానికే రాజీనామా చేశారని మండిపడ్డారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎవరికైనా సరే శిక్ష తప్పదని హెచ్చరించారు. అధికారం పోయిన తర్వాత పార్టీలో చేరిపోదామనుకుంటే.. చేర్చుకోవడం సరైనది కాదని అన్నారు. విజయసాయిని బీజేపీ చేర్చుకుంటుందని అనుకోవడం లేదని తెలిపారు. వైసీపీ రాబోయే రోజుల్లో కనుమరుగవుతుందని అభిప్రాయపడ్డారు. తొందరలోనే వైసీపీలో అందరూ సర్దుకుంటారని అన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చాతనైతలేదు

నల్గొండ: సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చాతకావడం లేదని, మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో అన్ని విధాలుగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నల్లగొండ జిల్లాలో రైతు ధర్నాలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పాలకులపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పాలనలో మహాత్మాగాంధీ యూనివర్సిటీలో విద్యార్థులు గొడ్డు కారంతో అన్నం తినాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఐటీ టవర్ కళ తప్పిందని విమర్శించారు. తన రాక సందర్భంగా నల్లగొండ ప్రజల ఆదరణ చూస్తుంటే.. తాను రైతు ధర్నాకు వచ్చినట్లు లేదని, విజయోత్సవ ర్యాలీకి వచ్చినట్లు ఉందని అన్నారు. కేటీఆర్ ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'ఇవాళ నల్లగొండ పట్టణంలో అడుగుపెట్టగానే మహాత్మాగాంధీ యూనివర్సిటీ దగ్గర మూడు, నాలుగు వందల మంది విద్యార్థులు రోడ్డు మీదికి వచ్చిండ్రు. 'అన్నా కేసీఆర్ పాలనలో మాకు అన్ని వసతులు ఉండేవి. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గొడ్డు కారంతో అన్నం తినే దుస్థితి వచ్చింది. ఒకసారి మీరు మా క్యాంపస్‌కు రావాలె' అన్నరు. తప్పకుండా మధ్యాహ్నం రెండున్నర గంటలకు వస్త అని వాళ్లకు చెప్పి వచ్చిన. అక్కడి నుంచి బయలుదేరి ముందుకు రాంగనే కళ తప్పిన ఐటీ టవర్ కనిపించింది. వెంకట్‌రెడ్డి వచ్చినంక అండ్ల ఎవలన్న ఉన్నరో.. లేకుంటే తాగుబోతుల అడ్డా అయిందోగానీ, మొత్తానికైతే ఐటీ టవర్ కళ తప్పింది' అన్నారు. 'అక్కడి నుంచి కొంచెం ముందుకు రాంగనే.. ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఇక్కడి దాకా (రైతు ధర్నా ప్రాంగణం) జనం భారీ సంఖ్యలో కనిపించారు. దాంతో నాకు ధర్నాకు వచ్చినట్టు అనిపించలే. కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యిండ్రు. మళ్లీ మన ప్రభుత్వం వచ్చింది. మళ్లీ భూపాల్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యిండు అనిపించింది. ఒక విజయోత్సవ ఊరేగింపు జరిగినట్లుగా ఉంది. భారీగా ధర్నాకు తరలివచ్చిన నల్లగొండ రైతు బిడ్డలకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని కేటీఆర్ చెప్పారు.

# బండిసంజయ్ దిష్టిబొమ్మ దహనం

**రాజన్న సిరిసిల్ల:** ప్రజా గాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండపల్లిలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తన ఆట, పాటలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గద్దర్‌పై సంజయ్ నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాగా, 'నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే.. నక్సలైట్లతో కలిసి ఎంతో మందిని గద్దర్ హత్య చేయించారు. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎందుకు ఇవ్వాలి' అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

వేగుచుక్క

# వడ్డీ రేట్లు మార్చిన దిగ్గజ బ్యాంక్..

బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలను కుంటున్న వారికి అలర్ట్. ప్రముఖ బ్యాంక్ అయిన యాక్సిస్ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను సవరించింది. కొత్త వడ్డీ రేట్లు జనవరి 27వ తేదీ నుంచే అమలులోకి వచ్చినట్లు తెలిపింది. గరిష్ఠంగా 7.75 శాతం మేర వడ్డీ ఆఫర్ చేస్తోంది. మరి లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు, గరిష్ఠ రేట్ల మెచ్యూరిటీ టెన్యూర్ వంటి పూర్తి వివరాలు తెలుసుకుందాం




మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలనుకుంటున్నారా? అయితే మీకో అలర్ట్. ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన యాక్సిస్ బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. సవరించిన కొత్త వడ్డీ రేట్లను జనవరి 27వ తేదీ నుంచే అమలులోకి తీసుకొచ్చినట్లు తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలియజేసింది. వడ్డీ రేట్ల సవరణ ద్వారా జనరల్ కస్టమర్లకు 3 శాతం నుంచి 7.25 శాతం వరకు వడ్డీ రేట్లు కల్పిస్తుండగా.. సీనియర్ సిటిజన్లకు అదనంగా 50 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ ఇస్తోంది. అంటే గరిష్ఠ వడ్డీ రేట్లు 7.75 శాతం వడ్డీ లభిస్తోంది. ఆ వివరాలు తెలుసుకుందాం.

గరిష్ఠ వడ్డీ రేట్లు ఈ స్కీమ్ ద్వారానే..

యాక్సిస్ బ్యాంక్ వడ్డీ రేట్ల సవరణ తర్వాత రూ.3 కోట్ల లోపు ఉండే రిటైల్ డిపాజిట్లపై 7 రోజుల నుంచి 10 ఏళ్ల వరకు టెన్యూర్ డిపాజిట్లపై జనరల్ కస్టమర్లకు 3 శాతం నుంచి 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 3.50 శాతం నుంచి 7.75 శాతం వడ్డీ ఇస్తోంది. గరిష్ఠ వడ్డీ రేటు 15 నెలల నుంచి 2 ఏళ్ల మెచ్యూరిటీ పీరియడ్ గల ఎఫ్‌డీ స్కీమ్ పైన ఇస్తోంది. ఇందులో జనరల్ కస్టమర్లకు 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది.

యాక్సిస్ బ్యాంక్ లేటెస్ట్ ఎఫ్‌డీ రేట్లు..

- 7 రోజుల నుంచి 29 రోజుల వరకు సీనియర్ సిటిజన్లకు వడ్డీ రేట్లు 3.50 శాతంగా ఉన్నాయి
- 30 రోజుల నుంచి 45 రోజుల వరకు సీనియర్లకు 4 శాతం వడ్డీ ఇస్తోంది.
- 46 రోజుల నుంచి 60 రోజుల టెన్యూర్ డిపాజిట్లపై 4.75 శాతం వడ్డీ లభిస్తోంది.
- 61 రోజుల నుంచి 87 రోజుల వరకు 5 శాతం, 88 రోజుల నుంచి 3 నెలల 24 రోజుల వరకు 5.25 శాతం వడ్డీ ఇస్తోంది.
- 3 నెలల 25 రోజుల నుంచి 6 నెలల వరకు 5.25 శాతం వడ్డీ ఇస్తోంది.
- 6 నెలల నుంచి 9 నెలల వరకు 6.25 శాతం, 9 నెలల నుంచి ఏడాది లోపు 6.50 శాతం వడ్డీ ఇస్తోంది.
- ఏడాది నుంచి 15 నెలల వరకు 7.20 శాతం, 15 నెలల నుంచి 2 ఏళ్లలోపు వరకు 7.75 శాతం వడ్డీ ఇస్తోంది.
- 2 సంవత్సరాల నుంచి 5 ఏళ్ల వరకు 7.60 శాతం వడ్డీ ఇస్తోంది.
- 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల వరకు 7.75 శాతం ఇస్తోంది.

# మార్పుల నుంచి సెక్షన్ లిమిట్ పెంపు వరకు..

బడ్జెట్ 2025కు ఇంకొద్ది రోజులే ఉంది. ఈ క్రమంలో ఎవరి డిమాండ్లను వారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముందుంచుతున్నారు. అయితే ఎప్పుడూ పన్ను చెల్లింపుదారులు.. బడ్జెట్‌లో ప్రకటనల గురించి ఆసక్తిగా చూస్తుంటారన్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా మధ్యతరగతి వర్గం ఆదాయపు పన్నుకు సంబంధించి కొన్ని మార్పుల్ని కోరుకుంటున్నారు. అవేంటో చూద్దాం.

వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26కు సంబంధించి వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం.. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 1న, ఉదయం 11 గంటల సమయంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. లోక్‌సభలో ప్రవేశపెడతారు. ఈసారి కూడా బడ్జెట్ సమావేశాల్ని రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న బడ్జెట్‌కు ముందుగానే.. జనవరి 31న ఆర్థిక సర్వేను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దేశ ఆర్థిక పరిస్థితుల్ని తెలియజేసేదే ఆర్థిక సర్వే. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇదే తొలి పూర్తి స్థాయి బడ్జెట్ కాబట్టి అంచనాలు ఎక్కువే ఉన్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి వర్గం.. ఆదాయపు పన్ను విధానంలో కీలక మార్పులు కోరుకుంటోంది. ఆదాయపు పన్నుకు సంబంధించి.. వారేం కోరుకుంటున్నారో ఇక్కడ చూద్దాం.




టాక్స్ శ్లాబుల్లో మార్పులు- మధ్యతరగతి వర్గానికి వ్యక్తిగత ఆదాయపు పన్నుకు సంబంధించి మరింత ఊరట కలిగించేలా నిర్మలమ్మ నిర్ణయం తీసుకోవాలని ప్రధాన డిమాండ్‌గా ఉంది. కనీస పన్ను మినహాయింపు పరిమితి ప్రస్తుతం రూ. 3 లక్షలుగా ఉండగా.. రూ. 4 లక్షలకు పెంచడం తప్పనిసరి అని.. ఇంకా టాక్స్ రిబేట్ లిమిట్ రూ. 7 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని టాక్స్2విన్ సీఈఓ అభిషేక్ సోనీ కోరుతున్నారు. రూ. 15 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి టాక్స్ రేట్లు తగ్గించాలని క్లియర్‌టాక్స్ టాక్స్ ఎక్స్‌పర్ట్ షెఫాలీ ముంద్రా అంటున్నారు.

ఇల్లు కొనుగోలు చేసే వారు లేదా నిర్మించుకోవాలనుకునే వారి కోసం కూడా వారిని ప్రోత్సహించేందుకు కొత్త పన్ను విధానంలో కీలక ప్రకటనలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హోం లోన్లకు సంబంధించి పన్ను తగ్గింపు పరిమితి పెంచి ప్రోత్సాహకాల్ని ఇవ్వడం అనేది కూడా ప్రధాన డిమాండ్‌గా ఉంది. మినహాయింపు పరిమితిని రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని ఇంకా.. విత్‌డ్రాయల్స్ కూడా పూర్తిగా టాక్స్ ఫ్రీ చేయాలని సోనీ డిమాండ్ చేస్తున్నారు.

టాక్స్‌పేయర్లకు సమానత్వం కింద.. ఎక్కువ జీవన వ్యయం ఉన్న నగరాలైన హైదరాబాద్, పుణె, బెంగళూరుల్లో కూడా హౌస్ రెంట్ అలవెన్స్ పరిమితిని 50 శాతానికి పెంచాలని కోరుతున్నారు.

సీనియర్ సిటిజెన్లకు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల బడ్జెట్‌లో పెంచిన షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్‌ను తగ్గించాలని కోరుతున్నారు. సీనియర్ సిటిజెన్లకు ఊరట కలిగించేలా వారికి కనీస పన్ను మినహాయింపు పరిమితి తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. టాక్స్ సేవింగ్స్ ఇన్వెస్ట్‌మెంట్లు పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, ఎల్ఐసీ ప్రీమియం వంటి వాటిపై సెక్షన్ ని కొత్త పన్ను విధానానికి కూడా అమలు చేసి.. ఇంకా లిమిట్ పెంచాలని కోరుతున్నారు.

# ఎయిర్‌టెల్ గుడ్‌న్యూస్.. ఆ ప్లాన్ల ధరల తగ్గింపు..

## రూ. 469తో ఇప్పుడు 84 రోజుల వ్యాలిడిటీ.. అన్‌లిమిటెడ్!

ట్రాయ్ ఆదేశాల నేపథ్యంలో ఇటీవల రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ వాయిస్ ఓన్లీ ప్లాన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వీటి కింద తక్కువ ధరల్లోనే ఎక్కువ రోజుల వ్యాలిడిటీతో.. అన్‌లిమిటెడ్ వాయిస్, ఎస్ఎంఎస్ సేవల్ని తీసుకొచ్చాయి. తాజాగా ఎయిర్‌టెల్ మరో గుడ్‌న్యూస్ చెప్పింది. తాజాగా తెచ్చిన ఈ ప్లాన్ ధరల్ని మరోసారి తగ్గించింది. ఇప్పుడు కొత్త ప్యాక్స్ అందుబాటులోకి వచ్చాయి.

దిగ్గజ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ శుభవార్త చెప్పింది. ఇటీవల తీసుకొచ్చిన వాయిస్ ఓన్లీ రీఛార్జ్ ప్లాన్ ధరల్ని మరోసారి సవరించింది. కిందటి సారి కంటే తక్కువ ధరలకే కొత్త ప్యాక్స్ ప్రవేశపెట్టింది. ఇప్పుడు ఈ వాయిస్, ఎస్ఎంఎస్ ఓన్లీ ప్లాన్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. కొద్దిరోజుల కిందట తీసుకొచ్చిన రెండు ప్లాన్ల ప్రయోజనాలు అలాగే ఉంచుతూ.. ఏ మార్పు చేయని ఎయిర్‌టెల్.. అంతకంటే తక్కువ ధరల్లోనే కొత్త ప్లాన్లను ప్రకటించడం విశేషం. ఇప్పటికే ఇవి రీఛార్జ్ ప్లాన్లలో అందుబాటులోకి వచ్చేశాయి. ఈ క్రమంలో పాత ప్యాక్స్‌ను వెబ్‌సైట్ నంచి తీసేసి అప్డేట్ చేసింది. ఇంతకుముందు ప్లాన్ ధరలు ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఎలా ఉన్నాయనేది చూద్దాం.

ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్ ధర కేవలం రూ. 469 మాత్రమే. దీని కింద రీఛార్జ్ చేసుకుంటే.. ఏకంగా 84 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ లోకల్ ఎస్టీడీ అండ్ రోమింగ్స్ కాల్స్ చేసుకోవచ్చు. ఇంకా 900లు లభిస్తాయి. దీంట్లో 3 నెలల పాటు అపోలో 24/7 సర్కిల్ మెంబర్‌షిప్ సహా హలో ట్యూన్స్ ప్రయోజనాల్ని కూడా పొందొచ్చు. దీనికి ముందు ఈ ప్లాన్ ధర రూ. 499 గా ఉండేది. అంటే దీనిపై రూ. 30 తగ్గించి అదే ప్లాన్ తీసుకొచ్చింది.

ఇక మరో ప్లాన్ విషయానికి వస్తే.. రూ. 1849తో ఉంది. ఇది యాన్యువల్ ప్లాన్ అని చెప్పొచ్చు. ఏకంగా 365 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఇక్కడ కూడా అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 3600 ఎస్ఎంఎస్‌లు వస్తాయి. ఇదే ప్రయోజనాలతో ఇటీవల తెచ్చిన ప్లాన్ ధర రూ. 1959 కాగా.. దాని కంటే ప్రస్తుత ప్యాక్ ధర రూ. 110 తక్కువగా ఉంది. దీనిపైనా అపోలో సర్కిల్, హలో ట్యూన్స్ బెనిఫిట్స్ పొందొచ్చు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల నేపథ్యంలోనే ఎయిర్‌టెల్ కొత్త ప్యాక్స్ ప్రకటించింది. ఇటీవల వాయిస్, ల కోసం ప్రత్యేకంగా రీఛార్జ్ ప్యాకేజీలు తీసుకురావాలని.. టెలికాం కంపెనీల్ని ట్రాయ్ ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో.. ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియా ఇలా అన్నీ




ఎయిర్‌టెల్ కొత్త ప్లాన్ ధర కేవలం రూ. 469 మాత్రమే. దీని కింద రీఛార్జ్ చేసుకుంటే.. ఏకంగా 84 రోజుల వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ లోకల్ ఎస్టీడీ అండ్ రోమింగ్స్ కాల్స్ చేసుకోవచ్చు. ఇంకా 900 లు లభిస్తాయి. దీంట్లో 3 నెలల పాటు అపోలో 24/7 సర్కిల్ మెంబర్‌షిప్ సహా హలో ట్యూన్స్ ప్రయోజనాల్ని కూడా పొందొచ్చు. దీనికి ముందు ఈ ప్లాన్ ధర రూ. 499 గా ఉండేది. అంటే దీనిపై రూ. 30 తగ్గించి అదే ప్లాన్ తీసుకొచ్చింది.

ప్రత్యేకంగా వాయిస్, కోసం డేటా లేకుండా ప్లాన్స్ తీసుకొచ్చాయి. అయితే.. వాటి ధరల్ని మరింత తగ్గించాలని ట్రాయ్ సూచించిన నేపథ్యంలోనే.. ఎయిర్‌టెల్ ఇప్పుడు తన ప్లాన్ ధరల్ని తగ్గించినట్లు గా తెలుస్తోంది. ఇదే సమయంలో రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా కూడా తమ ప్లాన్ రేట్లు సవరించొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అయితే.. ట్రాయ్ కొత్త నిర్ణయం ఆయా కంపెనీల ఆదాయంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# అక్రమవలసదారులపై అమెరికా అరాచకం!

అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి స్వదేశాలకు పంపించి వేస్తున్నారు. ఈక్రమంలోనే వారిపై దారుణ చర్యలకు పాల్పడుతున్నారు. తాజాగా యూఎస్‌లో ఉంటున్న పలువురు అక్రమ బ్రెజీలియన్లను కాళ్లు, చేతులు కట్టేసి తాగేందుకు గుక్కెడు మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా విమానంలో వారి దేశానికి పంపారు. కనీసం వారిని బాత్రూమ్‌లు కూడా వాడుకోనివ్వకుండా నరకం చూపించారు. అమెరికా తీరుపై బ్రెజిల్ సర్కారు ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.



గతేడాది నవంబర్ నెలలో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి వారం రోజుల క్రితమే 47వ దేశాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు డొనాల్డ్ ట్రంప్. బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటున్నారు. వారిని తిరిగి స్వదేశాలకు పంపేందుకు అనేక ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా అమెరికానే అక్రమ వలసదారులను గుర్తించి.. 500 సైనిక విమానాల ద్వారా వారిని స్వదేశాలకు పంపుతోంది.

అయితే తాజాగా యూఎస్ సర్కారు.. బ్రెజిల్ నుంచి అక్రమంగా వచ్చి అమెరికాలో జీవిస్తున్న పలువురిని గుర్తించి తిరిగి వెనక్కి పంపింది. ఈక్రమంలోనే వారికి నరకం చూపించింది. జైల్లో ఉన్న ఖైదీల పట్ల చూపించే కనికరం కూడా చూపించకుండా తరలించడంపై బ్రెజిల్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఆ పూర్తి వివరాలు మీకోసం.

అమెరికాలో అక్రమంగా వలస పొందుతున్న 80 మంది బ్రెజీలియన్లను ఆదివారం రోజు తిరిగి స్వదేశానికి పంపించింది. అయితే బ్రెజిల్ ఉత్తర నగరమైన మనౌస్‌లో ఆ విమానం ల్యాండ్ కాగా.. 80 మంది బ్రెజీలియన్ పౌరులు చేతులకు సంకెళ్లతో ఉన్నట్లు అక్కడి అధికారులు గుర్తించారు. ఈక్రమంలోనే వారందరినీ ప్రశ్నించగా అమెరికా వారికి చూపించిన నరకం గురించి చెప్పి కన్నీటి పర్యంతం అయ్యారు. ముఖ్యంగా తాము విమానంలో ఎక్కడానికి ముందే తమ చేతులకు సంకెళ్లు వేసినట్లు తెలిపారు.

ఆపై విమానంలోకి వచ్చి కూర్చున్నాకా తమ కాళ్లు కూడా కట్టేశారని బ్రెజీలియన్లు వివరించారు. విమానంలో ఉండగా.. దాహం వేస్తుందని అడిగితే కనీసం గుక్కెడు మంచినీళ్లు కూడా అందించకుండా తమను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. బాత్రూం వెళ్లాలని చెప్పినా వారు పట్టించుకోకుండా తమను అలాగే ఉంచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తాగేందుకు నీళ్లు లేక బాత్రూంకు వెళ్లలేక అనేక మంది అస్వస్థతకు గురయ్యారని స్పష్టం చేశారు. ముఖ్యంగా యూఎస్ నుంచి ఇదే విమానంలో వచ్చిన ఎడ్గార్ డా సిల్వా మౌరా అనే 31 ఏళ్ల కంప్యూటర్ టెక్నీషియన్ మాట్లాడుతూ.. బహిష్కరణకు ముందే తాను 7 నెలల పాటు అమెరికా నిర్బంధంలో ఉన్నట్లు తెలిపాడు. విమానంలో పలు సాంకేతిక సమస్యల వల్ల ఏసీలు కూడా పని చేయకపోవడంతో.. అనేక మంది మూర్ఛపోయారని వివరించారు.

అలాగే 21 ఏళ్ల లూయిస్ ఆంటోనియా రోడ్రిగ్స్ శాంటోస్ మాట్లాడుతూ.. ఏసీలు నాలుగు గంటలు పని చేయలేదని దీని వల్ల పలువురు శ్వాస తీసుకోవడానికి కూడా చాలా ఇబ్బంది పడ్డారని చెప్పారు. తాము వచ్చిన విమానం ఆగ్నేయ నగరమైన హొరిజోంటేలో ల్యాండ్ కావాల్సిందని కానీ సాంకేతిక సమస్యల కారణంగా మనౌస్‌లో ల్యాండ్ చేశారని స్పష్టం చేశారు. అక్రమ వలసదారుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరుపై బ్రెజిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్యలను తీవ్రంగా పరిగణించింది. బ్రెజిలియన్ పౌరుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లేనని స్పష్టం చేసింది. ఇకపై పంపించే వారినైనా చేతులకు సంకెళ్లు లేకుండా.. గౌరవంగా తీసుకు రావాలని వెల్లడించింది. చూడాలి మరి అమెరికా ముమ్ముందు మరేం చేయనుందో.

# ట్రంప్ హెచ్చరికలతో వెనక్కి తగ్గిన కొలంబియా..

అమెరికాలో ఉన్న అక్రమ వలస దారులను ప్రత్యేక సైనిక విమానాల్లో వారి స్వదేశానికి పంపే విషయంలో.. కొలంబియా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అమెరికా నుంచి వచ్చే విమానాలపై నిషేధం కూడా ప్రకటించింది. కానీ ట్రంప్ సుంకాలు పెంచుతామని హెచ్చరించడంతో కొలంబియా వెనక్కి తగ్గింది. అమెరికా పెట్టిన అన్ని నిబంధనలకు ఓకే చెప్పింది. దీంతో అగ్రరాజ్యం సైతం ఆ దేశంపై విధించిన సుంకాలు, ఆంక్షలను ఎత్తివేసింది. ఈ విషయాన్ని నేరుగా యూఎస్ సర్కారే వెల్లడించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.



అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అక్రమ వలదారులపై చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. వారందరినీ తిరిగి వారి దేశాలకు పంపించేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. ముఖ్యంగా 500 ప్రత్యేక సైనిక విమానాల ద్వారా అక్రమ వలదారులపను వారి స్వదేశాలకు చేరుస్తున్నారు. అయితే ఈ చర్యలను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వ్యతిరేకించి.. యూఎస్ విమానాలపై నిషేధం విధించారు. దీంతో ట్రంప్ సుంకాలు పెంచుతామంటూ హెచ్చరికలు జారీ చేయగా కొలంబియా వెనక్కి తగ్గింది. దీంతో అమెరికా సైతం.. ఆ దేశంపై విధించిన సుంకాలు, ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు వివరించింది. ఆ పూర్తి వివరాలు మీకోసం.



అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను 500 ప్రత్యేక సైనిక విమానాల్లో వారి స్వదేశాలకు పంపేందుకు ట్రంప్ సర్కారు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలువురిని పంపించి వేసింది. ఈ చర్యలపై ప్రపంచ వ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా తమ దేశానికి చెందిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ ప్రత్యేక విమానాల ద్వారా పంపకుండా.. పౌర విమానాల ద్వారా మాత్రమే వారిని తమ దేశానికి పంపించాలంటూ కొలంబియా తెలిపింది. అప్పటి వరకు అమెరికా విమానాలపై నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించింది.

గౌరవంగా పంపించేలా నిబంధనలు రూపొందిస్తేనే విమానాలను అనుమతిస్తామంటూ ఆ దేశ అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు. ఇప్పటికే కొన్ని సైనిక విమానాలను వెనక్కి పంపినట్లు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలంబియా సర్కారు విమానాలను వెనక్కి పంపడంపై జీర్ణించుకోలేకపోయారు. దీంతో కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా కొలంబియన్ సర్కారు అధికారుల వీసాలను కూడా వెంటనే రద్దు చేస్తామంటూ వెల్లడించారు. ఇవి కేవలం ప్రారంభ చర్యలు మాత్రమేనంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వెనక్కి తగ్గారు. అగ్రరాజ్యం అమెరికా పెట్టిన ఆంక్షలు, నిబంధనలకు ఓకే చెప్పారు. అమెరికా సైనిక విమానాలను తమ దేశంలోకి రానిస్తామని.. పౌరులను తమ దేశానికి ఆహ్వానిస్తామని ప్రకటించారు. దీనిపై తాజాగా యూఎస్ స్పందించింది. కొలంబియా వెనక్కి తగ్గడంతో.. ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలివి వేస్తున్నట్లు ప్రకటించింది. కేవలం కొలంబియా మాత్రమే కాదు ఏ దేశం తమ పౌరులను వెనక్కి తీసుకోకపోయినా.. ఇలాంటి చర్యలే తీసుకుంటామంటూ వెల్లడించింది. ఈ విషయం అర్థం చేసుకుని అన్ని దేశాలు తమకు సహకరించాలని.. అక్రమ వలసదారులను స్వదేశాలకు రప్పించుకోవాలని వివరించింది.

# వయసు పైబడిన వరుణ్ని చూసి.. స్పృహ తప్పిన వధువు..

వయసు పైబడిన వ్యక్తిని ఓ యువతికి ఇచ్చి పెళ్లి చేయబోగా.. తన పక్కన కూర్చున్న వ్యక్తిని చూడగానే ఆ యువతి కేక వేసి పడిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఈ వీడియో నిజంగా జరిగింది కాదు. హ్యూమర్ కోసం తీసిన స్క్రిప్టెడ్ వీడియో.

వివాహం అనేది చాలా పెద్ద ప్రక్రియ. ఫొటోలు చూడటంతో మొదలుపెట్టి.. పెళ్లి చూపులు, ఎంగేజ్‌మెంట్, పెళ్లి, రిసెప్షన్.. ఇలా రోజుల తరబడి ఈ ప్రక్రియ సాగుతుంది. అయితే పాత రోజుల్లో ఈ సుదీర్ఘ ప్రక్రియ ఉండేది కాదు. పెద్దవాళ్లు పెళ్లి పిల్లను లేదా పిల్లాణ్ని చూసుకొని వచ్చి నేరుగా పెళ్లి చేసేవారు. పెళ్లయ్యేంత వరకు తన భర్త ఎలా ఉంటాడో భార్యకు తెలిసేది కాదు. ఇప్పటికీ ముస్లిం సమాజంలో అక్కడక్కడ ఇలాంటి కట్టుబాట్లు కనిపిస్తుంటాయి. ఇలాంటి కట్టుబాట్ల ఆధారంగా తీసిన ఓ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

"బంగ్లాదేశ్‌లో పెద్దలు కుదిర్చిన పెళ్లిలో.. తాను వివాహం చేసుకున్న వ్యక్తిని చూడగానే యువతి స్పృహతప్పి పడిపోయింది." అనే క్యాప్షన్‌తో ఉన్న ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ పేజీలో 2025 జనవరి 25న పోస్టు చేశారు. చాలా మంది అమ్మాయిల విషయంలో ఇది నిజం అని వీడియోపై రాసుకొచ్చారు.

ఈ వీడియో నిజమేనా అని తేల్చడం కోసం సజగ్ టీమ్ వీడియో స్క్రీన్ షాట్ సాయంతో గూగుల్ రివర్స్ ఇమేజ్ సెర్చ్ ద్వారా వెతికింది. జనవరి 18న హెదయత్ ఇస్లాం వ్లాగర్ అనే యూట్యూబ్ ఛానెల్‌లో పోస్టు చేసిన వీడియో కనిపించింది. దానికి వైరల్ వీడియో, ఫన్నీ వీడియో అనే హ్యాష్ ట్యాగ్‌లు జతపరిచారు. వీడియో చివర్లో.. బాగా ఫేమస్ అయిన ఆఫ్రికా బుడ్డోడు నవ్వుతున్న పార్ట్ కనిపించింది. అయితే ఇన్‌స్టాలో కనిపించిన వీడియోలో ఈ పార్ట్ లేదు.

ఎక్స్‌లో సెర్చ్ చేయగా.. ఇంతియాజ్ మహమూద్ అనే యూజర్ పోస్టు చేసిన వీడియో కనిపించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో వాడిన క్యాప్షన్‌నే ఈ వీడియోకు సైతం వాడారు. జనవరి 25న పోస్టు చేసిన ఈ వీడియో 3.7 మిలియన్ల యూజర్లను రీచ్ కాగా.. 18 వేలకుపైగా లైకులొచ్చాయి. దీంతో మరికొందరు యూజర్లు పోస్టు చేసిన వీడియోలను సైతం సజగ్ టీమ్ గుర్తించింది.

అయితే ఈ వీడియోల కింద తప్పుడు సమాచారం అని రీడర్స్ జత చేసిన కంటెక్స్ట్ కనిపించింది. ఓ ఫేస్‌బుక్ లింక్‌ను సైతం జతపరిచారు. అది క్లిక్ చేయగా.. ఫేస్ బుక్ పేజీలో 'భార్య పరిస్థితి ఏంటో అల్లుణ్ని అడగండి' అని బెంగాలీ భాషలో రాసిన క్యాప్షన్‌తో పోస్టు చేసిన వీడియో కనిపించింది. 2024 జులై 26న పోస్టు చేసిన ఈ వీడియో డ్యురేషన్ 3 నిమిషాల 4 సెకన్లు ఉంది. ఫేస్ బుక్ పేజీకి సంబంధించిన సమాచారం చూడగా.. ఇంట్రోలో 'హలో ఫ్రెండ్స్, నేను దెల్వార్.. సౌదీ అరేబియాలో నివసిస్తున్నాను. మేం ఎవరినీ కించపర్చేందుకు వీడియోలు చేయము. కేవలం మన జ్ఞాపకాలను సజీవంగా ఉంచడానికే చేస్తాం.

మేం ఎలాంటి పెళ్లి కార్యక్రమం చేయము. మీకున్న ఫిర్యాదులను మాకు తెలియజేయండి' అంటూ ఈ-మెయిల్ ఐడీ, వాట్సాప్ నంబర్ ఇచ్చారు.

ఇంట్రోలో పేర్కొనట్టుగానే ఈ ఫేస్‌బుక్ పేజీలో పెళ్లికి సంబంధించి రకరకాల స్క్రిప్టెడ్ వీడియోలను పోస్టు చేశారు. దీన్ని బట్టి వైరల్ అవుతోన్న వీడియో స్క్రిప్టెడ్ అని సజగ్ టీమ్ నిర్ధారణకు వచ్చింది.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# పొలిటికల్ మైలేజ్ కోసం పెట్టారా?



దళపతి విజయ్ చివరి చిత్రం హెచ్ వినోద్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. దళపతి 69 ప్రాజెక్ట్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. దళపతి 69 ప్రాజెక్ట్‌కి జన నాయగన్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ మేరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్‌ని చూస్తే దళపతి విజయ్ తన ఫ్యాన్స్‌తో దిగిన ఐకానిక్ సెల్ఫీ మూమెంట్ గుర్తుకు వచ్చేలా ఉంది.

జన నాయగన్ అని టైటిల్ పెట్టడం వెనుకున్న ఉద్దేశం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సినిమా కథకి ఈ టైటిల్‌కు ఎంత యాప్ట్ ఉంటుందో తెలియడం లేదు కానీ.. ప్రస్తుతం పొలిటికల్ జర్నీకి మాత్రం యాప్ట్ అయ్యేలానే ఉంది. పొలిటికల్ మైలేజ్ కోసమే ఇప్పుడు జన నాయగన్ అనే టైటిల్‌ను పెట్టినట్టుగా కనిపిస్తోంది. ఇక ఈ మూవీ బాలయ్య భగవంత్ కేసరికి రీమేక్ అన్న సంగతి తెలిసిందే.

ప్రొడక్షన్ టీం ఎక్కడా ఈ విషయాన్ని బయటకు రివీల్ చేయడం లేదు. కానీ పూజా హెగ్డే, మమితా బైజులు పూజా కార్యక్రమాల్లో కనిపించడంతోనే ఇది భగవంత్ కేసరి రీమేక్ అని అంతా ఫిక్స్ అయ్యారు. కాజల్ పాత్రలో పూజా హెగ్డే.. శ్రీలీల కారెక్టర్‌లో మమితా బైజు నటిస్తున్నారని అంతా అనుకుంటున్నారు. రీసెంట్‌గా సంక్రాంతికి వస్తున్నాం ప్రమోషన్స్ టైంలో వీటీవీ గణేష్ ఈ మూవీ రీమేక్ అని లీక్ చేశాడు.

రీమేక్ చేసే ఆఫర్‌ను కూడా అనిల్ రావిపూడికి ఇచ్చారట. కానీ అనిల్ రావిపూడి మాత్రం రీమేక్ చేయడం కష్టమని, తనకున్న కమిట్మెంట్లకు ఇప్పుడు కష్టమని సున్నితంగా తిరస్కరించినట్టు తెలుస్తోంది. మరి ఈ జన నాయగన్ అనేది భగవంత్ కేసరికి నిజంగానే రీమేకా? కాదా? అన్నది ఇంకొన్ని రోజుల్లో తేలనుంది. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, ట్రైలర్ వస్తే కథపై ఓ క్లారిటీ వస్తుందన్న సంగతి తెలిసిందే. మొత్తానికి విజయ్ చివరి చిత్రం మీద కోలీవుడ్ స్పెషల్ ఫోకస్ అయితే పెట్టింది.

# ఫొటోకు దండ వేసి అనారోగ్యమట..

బాలీవుడ్ దిగ్గజ నటుడు, బిగ్ బీ అమితాబ్ బచ్చన్ గురించి భారతీయులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. భాషతో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా అమితాబ్‌కు అభిమానులు ఉన్నారు. 82 ఏళ్ల వయసులోనూ ఆయన ఎంతో యాక్టివ్‌గా ఉండటమే కాదు.. సినిమాల్లోనూ నటిస్తున్నారు. ఆయన ఇటీవల రియల్ ఎస్టేట్‌లోనూ పెట్టుబడులు పెడుతూ.. తెలివిగా కోట్లు సంపాదిస్తున్నారు. అలాంటిది బిగ్ బీ గురించి ఓ ఫేక్ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

'దేవుడు అమితాబ్ బచ్చన్‌ను ఆశీర్వదిస్తాడు! బచ్చన్ కుటుంబం తమ భర్త-తండ్రి-తాత అమితాబ్ బచ్చన్ ఆరోగ్యం కోసం ఆత్రుతగా ఉంది!' అని అర్థం వచ్చే ఇంగ్లిష్ క్యాప్షన్‌తో ఖుష్బూ ఘజిపూరీ అనే ఫేస్ బుక్ పేజీలో చేసిన ఓ పోస్టు వైరల్ అయ్యింది. ఆ పోస్టులో ఉన్న ఫొటోలో అమితాబ్ బచ్చన్ ఫొటోకు దండ వేసినట్లు.. అభిషేక్ బచ్చన్ పాడే మోస్తున్నట్లుగా ఉంది. మరిన్ని వివరాల కోసం అని ఓ లింక్ ఇచ్చారు. గత కొద్ది వారాలుగా అమితాబ్ ఆరోగ్యం క్షీణిస్తున్నట్లుగా ఇందులోని కథనంలో పేర్కొన్నారు.

అమితాబ్ బచ్చన్ ఆరోగ్యం క్షీణించిందా..? ఆయన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారా? అనే విషయం తెలుసుకునేందుకు సజగ్ టీమ్ ప్రయత్నించింది. రిపబ్లిక్ డే సందర్భంగా ఆయనతోపాటు పలువురు సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తూ పోస్టు చేశారంటూ జీ న్యూస్ వెబ్‌సైట్లో రాసిన ఓ కథనం కనిపించింది. అమితాబ్ ఎక్స్ అకౌంట్ చూడగా.. ఆయన రెగ్యులర్‌గా ఎక్స్‌లో పోస్టులు చేస్తున్నట్టుగా కనిపించింది.

82 ఏళ్ల వయసులో అమితాబ్ హెల్త్ సీక్రెట్ గురించి ఎకనమిక్ టైమ్స్ పబ్లిష్ చేసిన వెబ్ స్టోరీ మినహా ఇటీవలి



కథనాలేవీ కనిపించలేదు. ముఖ్యంగా ఆయన ఆరోగ్యం క్షీణించిందని పేర్కొనే కథనాలేవి కనిపించలేదు. ఇదే కీవర్డ్‌తో ఎక్స్‌లో వెతికినప్పటికీ.. ఎలాంటి పోస్టులు కనబడలేదు.

యూట్యూబ్‌లో మాత్రం పది నెలల క్రితం అమితాబ్ బచ్చన్‌ను ముంబైలోని కోకిలాబెన్ హాస్పిటల్‌లో చేర్పించినట్లు సీఎన్ఎన్-న్యూస్18 ఛానెల్‌లో పోస్టు చేసిన వీడియో కనిపించింది. 2024 మార్చి 15న బిగ్ బీని కోకిలాబెన్ హాస్పిటల్‌లో చేర్పించగా.. ఆయన కాలులో ఉన్న క్లాట్‌ను తొలగించడానికి యాంజియోప్లాస్టీ చేశారని.. అయితే కొద్ది గంటలకే డిశ్చార్జ్ అయిన ఆయన థానేలో ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు చూస్తున్నట్లుగా ఎకనమిక్ టైమ్స్ కథనంలో పేర్కొన్నారు.

అమితాబ్ లాంటి పేరున్న నటుడికి అనారోగ్య సమస్యలు తలెత్తితే.. మీడియాలో విస్తృతంగా కవరేజీ లభిస్తుంది. ఆయన ఆరోగ్యం గురించి ఎప్పటికప్పుడు అప్డేట్స్ బయటకొస్తాయి. కానీ మీడియాలోఎక్కడా బిగ్ బీ అనారోగ్యం పాలైనట్లు వార్తలు కనిపించలేదు. అంతే కాదు మరోవైపు ఆయన సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా పోస్టులు చేస్తున్నారు. దీన్ని బట్టి అమితాబ్ అనారోగ్యం పాలైనట్లు ఫేస్‌బుక్ పేజీలో కనిపించిన పోస్టు ఫేక్ అని నిర్ధారించడమైనది.

# మిస్టర్ బచ్చన్ ఓ డిజాస్టర్!..



మాస్ మహారాజా రవితేజ పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియా ద్వారా వేలాది మంది అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు. రవితేజ సినిమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్ రవితేజ పుట్టిన రోజును జరుపుకున్నారు. రవితేజ ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఎదిగారు. అందుకే ప్రతి ఒక్కరూ ఆయన్ను చాలా స్పెషల్‌గా చూస్తారు. చిరంజీవి తర్వాత టాలీవుడ్‌లో బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఈ స్థాయికి వచ్చింది రవితేజ అనే అభిమానం చాలా మందిలో ఉంటుంది. ఆ అభిమానంతోనే పుట్టిన రోజును చాలా ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు.

ఫ్యాన్స్ మాత్రమే కాకుండా ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు సైతం రవితేజ పుట్టిన రోజు సందర్భంగా సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తూ, రవితేజతో తమకు ఉన్న అనుబంధం గురించి ప్రస్తావించారు. ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్‌లో రవితేజ పుట్టిన రోజు సందర్భంగా ట్వీట్ చేశారు. మిరపకాయ్ ఇచ్చినా, మిస్టర్ బచ్చన్ ఇచ్చినా... అభిమానంలో ఆవగింజంత అయినా తేడా చూపని అన్నయ్యకు జన్మదిన శుభాకాంక్షలు, లవ్ యూ ఫర్ ఎవర్ అన్నయ్య అంటూ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ అందరి దృష్టిని ఆకర్షించింది. మిరపకాయ్‌తో రవితేజకు హరీస్ శంకర్ సూపర్ హిట్ ఇచ్చారు... చాలా కాలం తర్వాత అదే కాంబోలో వచ్చిన మిస్టర్ బచ్చన్ నిరాశ పరిచింది. గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన మిస్టస్ బచ్చన్ బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచిన విషయం తెల్సిందే. సినిమా నిర్మాత ఆ ప్రాజెక్ట్‌ను చేసి చాలా పెద్ద తప్పు చేశామని స్వయంగా చెప్పుకొచ్చారు. అలాంటి ఫ్లాప్ పై దర్శకుడు హరీష్ శంకర్ పెద్దగా నోరు విప్పలేదు. కానీ తాజా ట్వీట్ లో మిస్టర్ బచ్చన్ వంటి ఫ్లాప్‌ను ఇచ్చినా రవితేజ గారు తనపై చూపించే అభిమానంలో ఆవగింజంత అయినా తేడా చూపలేదనే ఉద్దేశ్యంతో ఈ ట్వీట్‌ను చేశారు. వీరిద్దరి కాంబోలో అంతకు ముందు వచ్చిన షాక్ సినిమా సైతం అతి పెద్ద డిజాస్టర్‌గా నిలిచింది. షాక్ సినిమాతో ఫ్లాప్ ఇచ్చినా వెంటనే మిరపకాయ్ సినిమాతో హరీష్ శంకర్‌కి రవితేజ ఛాన్స్ ఇచ్చారు. ఆ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వీరి కాంబోలో మరో సినిమా కోసం ప్రేక్షకులు చాలా కాలం వెయిట్ చేశారు. ఎదురుచూపులకు తెర దించుతూ రవితేజ, హరీష్ శంకర్ కాంబోలో గత ఏడాది మిస్టర్ బచ్చన్ వచ్చింది. కానీ సినిమా ఫ్లాప్ గా నిలిచింది. అత్యంత చెత్త సినిమాల జాబితాలో మిస్టర్ బచ్చన్ చేరింది.

అందుకే మిరపకాయ్ ఇచ్చినా... మిస్టర్ బచ్చన్ ఇచ్చినా అంటూ దర్శకుడు హరీష్ శంకర్ తనంతట తానుగానే మిస్టర్ బచ్చన్‌ను డిజాస్టర్‌గా ఒప్పుకున్నారు. మిస్టర్ బచ్చన్ నిరాశ పరచినా హరీష్ శంకర్ పై నమ్మకం ఉంది... కచ్చితంగా ఆయన మరో మిరపకాయ్, గబ్బర్ సింగ్ వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ సినిమాలతో రాబోయే రోజుల్లో బాక్సాఫీస్‌ను షేక్ చేయగల సత్తా ఉన్న దర్శకుడు. పవన్ కళ్యాణ్‌తో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను చేస్తున్న హరీష్ శంకర్ ఈ ఏడాది ఆ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# దొంగగా మారిన నితిన్..

టాలీవుడ్ నటుడు నితిన్, వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్ ఈ సినిమా నుంచి తాజాగా మేకింగ్ వీడియో విడుదల చేశారు మేకర్స్.

టాలీవుడ్ హీరో నితిన్ వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్ భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఇప్పటికే మువీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే నేడు రిపబ్లిక్ డే సందర్భంగా మూవీ నుంచి మేకింగ్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీలో నితన్ రాబిన్ హుడ్‌గా ఎలా మారాడో చూపించారు మేకర్స్.



ఈ సినిమా విషయానికి వస్తే.. నితిన్ ఇందులో రాబిన్ హుడ్ అనే దొంగ పాత్రలో నటిస్తున్నాడు. భారతీయులందరిని తన సోదరులు, సోదరీమణులుగా భావించి, వారి నుంచి డబ్బు దొంగిలిస్తుంటాడు నితిన్. ఈ క్రమంలోనే అతడికి ఎదురైన సంఘటనలు ఏంటి.. అనేది తెలియాలంటే సినిమా వచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే. ఇక భీష్మ సినిమా తర్వాత నితిన్ ఈ కాంబోలో మరో హిట్ కొట్టబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# పనులు షురూ..



విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరితో బిజీగా ఉన్నాడు. ప్రాజెక్ట్‌ని ఈ సమ్మర్‌లో గౌతమ్ తిన్ననూరి తీసుకొస్తాడు. ఆ తరువాత రవికిరణ్ కోలా ప్రాజెక్టుని ఈ ఏడాది చివరికల్లా విజయ్ పూర్తి చేసేలా ఉన్నాడు. ఆపై రాహుల్ సంకృత్యాన్ ప్రాజెక్ట్ మీద విజయ్ ఫోకస్ పెట్టేలా ఉన్నాడు. అయితే ఇంతలోపు సెట్ వర్క్స్, ప్రీ ప్రొడక్షన్ పనుల్ని రాహుల్ పూర్తి చేసుకుంటున్నాడు. ఇక ఇప్పుడు సెట్ వర్క్స్‌లో రాహుల్ బిజీగా ఉన్నాడు.

విజయ్ దేవరకొండ లైనప్ మామూలుగా లేదన్న సంగతి తెలిసిందే. అన్నీ డిఫరెంట్ సినిమాల్నే చేస్తున్నాడు. రెగ్యులర్ కమర్షియల్ చిత్రాలు అని కాకుండా.. కొత్తగా ఏదైనా చెప్పాలనే ఉద్దేశంలో విజయ్ దేవరకొండ డిఫరెంట్ కాన్సె ప్టులను ఎంచుకుంటున్నాడు. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరితో చేస్తున్న 12 ఇంటెన్స్ డ్రామా.. మాఫియా, పోలీస్, గ్యాంగ్ స్టర్ కాన్సెప్టుతో సాగుతుంది. ఇక ఆ నెక్ట్స్ రవికిరణ్ కోలాతో ఓ చిత్రం ఉండబోతోంది. విజయ్ కారెక్టరైజేషన్ గురించి ఆల్రెడీ రవి కిరణ్ కోలా హింట్ ఇచ్చాడు.

యుద్ధం నాదే.. రక్తం నాదే అంటూ విజయ్ పాత్ర ఎలా ఉండబోతోందో రవికిరణ్ కోలా చెప్పేశాడు. అందులో లవ్ యాంగిల్, రగ్డ్ యాంగిల్, ఇంటెన్స్ యాక్షన్ రివేంజ్ డ్రామాగా ఉంటుందని చెప్పుకొచ్చాడు. ఈ చిత్రం తరువాత విజయ్ తన లక్కీ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్‌తో మళ్లీ ఓ మూవీని చేస్తున్నాడు. టాక్సీవాలా తరువాత విజయ్, రాహుల్ కలిసి చేస్తున్న సినిమా కావడంతో సహజంగానే అంచనాలు ఉంటాయి.

రాహుల్ సంకృత్యాన్ ఈ సారి కొత్త ప్రపంచాన్ని క్రియేట్ చేస్తున్నాడట. ఇంత వరకు ఇండియన్ స్క్రీన్ ఎవ్వరూ చెప్పని, చూపించని కథను, చరిత్రను తెరకెక్కిస్తున్నాడట. ఈ మూవీ కోసం భారీ సెట్లు అవసరం పడేలా ఉన్నాయి. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనుల్ని పూర్తి చేసి సెట్ వర్క్‌ల మీద ఫోకస్ పెట్టాడు రాహుల్. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ మూవీ పూజా కార్యక్రమాలు ఇలా సింపుల్‌గా కానిచ్చేశారు. సెట్ వర్క్స్ కోసం ఇలా మొదటి ఇటుకని పేర్చినట్టుగా తెలుస్తోంది.

ఈ చిత్రంలో విజయ్‌కి జోడిగా రష్మికను తీసుకుంటారనే టాక్ వినిపిస్తోంది. ఈ మూవీకి బాలీవుడ్ ద్వయం అజయ్ అతుల్ సంగీతాన్ని అందిస్తారని సమాచారం. విజయ్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ హిట్లు ఇచ్చేందుకు మంచి గ్రౌండ్‌ను సిద్ధం చేసుకుంటున్నట్టుగా కనిపిస్తోంది. అసలే ఇప్పుడు విజయ్ ఓ సాలిడ్ హిట్ రావాల్సి ఉంది. ఓ బ్లాక్ బస్టర్ హిట్టుతో తన రౌడీల్లో (అభిమానుల్లో) మళ్లీ ఉత్సాహాన్ని విజయ్ నింపాల్సి ఉంది.

# సూపర్ స్టార్‌తో సర్‌ప్రైజ్ చేసిన కీర్తి సురేష్

ఆంటోనీ తటిల్‌తో కీర్తి సురేష్ వివాహం ఇటీవలే జరిగింది. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం వివాహం జరిగింది. పెళ్లికి సంబంధించిన ఫోటోలు వీడియోలతో సోషల్ మీడియాలో కీర్తి సురేష్, తటిల్‌ల జోడీ వైరల్ అయ్యారు. వీరి ప్రేమ గురించి ప్రస్తుతం రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దాదాపు పదేళ్లుగా వీరిద్దరూ ప్రేమించుకుంటూ ఉన్నారట. ప్రేమ వ్యవహారం ఎప్పుడూ బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. తాజాగా కీర్తి సురేష్ ఒక ఇంటర్వ్యూలో తటిల్‌తో తన రిలేషన్, పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత ఎలా ఉంది అనే విషయాలను పంచుకుంది. తటిల్‌కి పెళ్లి ముందు తాను ఒక అరుదైన గిఫ్ట్ ఇచ్చానంటూ ఒక ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది.

2017లో తటిల్ పుట్టిన రోజును తానే గ్రాండ్‌గా నిర్వహించాను. ఆ పుట్టిన రోజుకు తటిల్‌కి చెందిన స్నేహితులు దేశ విదేశాల నుంచి వచ్చారు. ఎంతో మందిని తాను ప్రత్యేకంగా పిలిచి తటిల్‌కి పార్టీ ఇచ్చాను. ఆ పార్టీకి విజయ్ సర్‌ని ఆహ్వానించాను. ఆయన వస్తానని అన్నారు. ఎవరో దర్శకుడు వస్తున్నారని అంతా అనుకున్నారు. విజయ్ సర్ వచ్చి డోర్ ఓపెన్ చేసిన



సమయంలో తటిల్ చూసి షాక్ అయ్యారు. విజయ్ సర్ దగ్గరకు వచ్చి తటిల్‌కి హ్యాపీ బర్త్‌డే అని చెప్పిన మూమెంట్ ఎప్పటికీ మరచిపోలేను అంది. విజయ్‌తో కలిసి కీర్తి సురేష్ యాక్టింగ్ చేసింది. ఇద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. అందుకే కీర్తి సురేష్, తటిల్‌ల వివాహానికి విజయ్ ప్రత్యేకంగా హాజరు అయ్యారు. రాజకీయాలు, సినిమాలతో ఎంతో బిజీగా ఉన్నా ఆ పెళ్లికి హాజరు కావడం ద్వారా విజయ్ తనకు కీర్తి సురేష్ పై ఉన్న అభిమానంను చాటుకున్నారు. కీర్తి సురేష్‌కి సైతం హీరోల్లో విజయ్ అంటే ప్రత్యకమైన అభిమానం. ఆ విషయాన్ని చాలా సార్లు ఆమె సైతం చెప్పుకొచ్చారు. తాజా ఇంటర్వ్యూలో అదే విషయాన్ని ఆమె చెప్పుకొచ్చారు. కీర్తి సురేష్ పెళ్లి తర్వాత కూడా ఎప్పటిలాగే సినిమాల్లో నటించనుంది. ఇటీవల ఆమె నటించిన బాలీవుడ్ మూవీ బేబీ జాన్ విడుదలైంది. కోలీవుడ్‌లో ఈమె నటిస్తున్న రెండు సినిమాలు విడుదలకు సిద్ధం అవుతున్నాయి. ఇతర భాషల్లోనూ ఈమె సినిమాలు చర్చలు జరుగుతున్నాయి.

# 300 కోట్ల క్లబ్బులోకి! సంక్రాంతికి వస్తున్నాం



సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు ఇంకా ఆదరణ తగ్గడం లేదు. సంక్రాంతి సీజన్ ముగిసినా కూడా కలెక్షన్లు తగ్గడం లేదు. ఇంకా ఫ్యామిలీ ఆడియెన్స్ ఈ మూవీని చూస్తూనే ఉన్నారు. పుష్ప, డాకు, గేమ్ ఛేంజర్ ఇవన్నీ కూడా సైడ్ అయిపోయాయి. ఇప్పుడు అంతా కూడా సంక్రాంతికి వస్తున్నాం హంగామానే నడుస్తోంది. ఇప్పటికే ఈ మూవీకి 260 కోట్లకు పైగా వసూళ్లు వచ్చాయని ప్రకటించారు.

సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు వస్తున్న ఆదరణ చూసి టాలీవుడ్ సర్కిళ్లు, ట్రేడ్ వర్గాలు షాక్ అవుతున్నట్టుగా ఉన్నాయి. అసలు ఈ మూవీకి ఇంతలా వసూళ్లు రావడం ఏంటి? అని అంతా నోరెళ్లబెట్టి ఉంటారు. అందరూ మాస్, యాక్షన్ అంటూ ఊక దంపుడు సినిమాల్ని తీస్తూనే ఉన్నారు. కానీ ఫ్యామిలీ ఆడియెన్స్ కోసం సినిమాలు తీయాలని అంతా మర్చిపోయారు. ఫ్యామిలీ అంతా హాయిగా థియేటర్‌కు వచ్చి ఎక్కడా రక్తపాతం, అభ్యంతరకరమైన సీన్లు లేకుండా చక్కగా నవ్వుకునే సినిమాలు వచ్చి చాలా కాలం అయింది. ఫ్యామిలీ ఆడియెన్స్ సైతం తమ సత్తా ఏంటో చాటేందుకు ఈ రేంజ్ వసూళ్లను ఇస్తున్నట్టుగా తెలుస్తోంది. పాన్ ఇండియా మోజులో పడి మమ్మల్ని వదిలేశారు అన్న కోపాన్ని, కసిని ఫ్యామిలీ ఆడియెన్స్ చూపిస్తున్నట్టుగా ఉంది. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఎంగేజ్ చేయడంలో అనిల్ రావిపూడి సక్సెస్ అయ్యాడు. వందల కోట్ల బడ్జెట్, సెట్లు కాదు.. సినిమాలో కంటెంట్, ఎంటర్టైన్మెంట్ ఉంటే చాలు అని ఆడియెన్స్ మరోసారి నిరూపించారు. అందుకే సంక్రాంతికి వస్తున్నాం సినిమాకు ఈ రేంజ్ కలెక్షన్లు వస్తున్నాయి.

పన్నెండు రోజుల్లోనే ఈ మూవీకి 260 కోట్లకు పైగా గ్రాస్ వచ్చింది. మామూలుగా అయితే ఇప్పుడున్న టైంలో ఓ సినిమా వారం రోజులు ఆడటమే కష్టం. కానీ ఈ చిత్రం రెండు వారాలుగా హౌస్ ఫుల్స్ నడుస్తున్నాయి. అది ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం. ఇప్పటికీ అన్ని చోట్లా థియేటర్లు నిండుగా కనిపిస్తున్నాయి. చూస్తుంటే ఈ మూవీని ఇప్పట్లో ఆపడం ఎవ్వరి తరం కాదనిపిస్తోంది.

సంక్రాంతికి వస్తున్నాం సినిమా త్వరలోనే మూడు వందల కోట్ల క్లబ్బులో చేరేలా కనిపిస్తోంది. ఇంకా వారం రోజులు సరైన సినిమా ఏదీ లేదు. ఫిబ్రవరిలో ఓ మోస్తరుగా సినిమాలు వస్తున్నాయి. అవి క్లిక్ అయినా కాకపోయినా సంక్రాంతికి వస్తున్నాం సినిమా మాత్రం ఇంకా తన హవాను కంటిన్యూ చేసేలానే ఉంది. ఈ మూవీ ఈ సంక్రాంతికి క్లియర్ విన్నర్ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.